AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
17-12-2025 (Wednesday)
MAIN EDITION

## అమెరికా నుంచి భారత్‌కు అపాచీ హెలికాప్టర్లు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా నుంచి భారత్‌కు అపాచీ హెలికాప్టర్లు చేరుకున్నాయి. భారత సైన్యం కోసం అమెరికా నుంచి రావాల్సిన అత్యంత ఆధునికమైన ఏహెచ్-64ఈ అపాచీ అటాక్ హెలికాప్టర్ల చివరి బ్యాచ్ చేరుకున్నాయి. దీంతో భారత సైన్యం ఆర్డర్ చేసిన మొత్తం ఆరు అపాచీ హెలికాప్టర్ల సరఫరా పూర్తయినట్లు భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం వెల్లడించింది. వాస్తవానికి ఈ ఏడాది ఫిబ్రవరి మార్చి నాటికే రావాల్సి ఉన్నా జాప్యం జరిగింది. ఈ మైలురాయిని రక్షణ ఒప్పందాల అమలులో భాగంగా ఒక కీలక అడుగుగా అమెరికా ఎంబసీ పేర్కొంది.

## పెరగనున్న చలి తీవ్రత



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో చలి వణికిస్తోంది. మధ్యాహ్నం సైతం చలిగాలులు వీస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో వాతావరణ శాఖ అధికారులు అలెర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలో రానున్న నాలుగు రోజులు చలి పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ నెల 18 నుంచి 21 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతాయని చెప్పారు. చాలా ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ టెంపరేచర్లు నమోదవుతాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో 7 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. పశ్చిమ తెలంగాణలో 7-9 డిగ్రీల కంటే తక్కువకు పడిపోతుందని అధికారులు తెలిపారు.

## హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

**అక్షరటుడే, హైదరాబాద్: శీతాకాలం విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. హకీంపేటలోని ఎయిర్‌ఫోర్స్ శిక్షణ కేంద్రానికి ప్రత్యేక విమానం ద్వారా చేరుకున్న ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క స్వాగతం పలికారు. ఈ నెల 22వ తేదీ వరకు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.**



## మూడో రోజూ నష్టాలే..

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశీయ స్టాక్ మార్కెట్లు మూడో రోజు కూడా నష్టాల్లోనే ముగిశాయి. అమెరికా, భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం ఎటూ తేలడం లేదు. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ రోజురోజుకు పడిపోతోంది. దీంతో బుధవారం సెన్సెక్స్ 120, నిఫ్టీ 41 పాయింట్ల నష్టంతో క్లోజ్ అయ్యాయి.**



## జనసేన కీలక సమావేశం

**అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణలో జనసేనను విస్తృతం చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఈనెల 18న కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఉమ్మడి 10 జిల్లాల పార్టీ శ్రేణులు, గ్రేటర్ హైదరాబాద్ పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు.**



## షాకిస్తున్న వెండి ధరలు..

**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. రాకెట్ వేగంతో ధరలు పెరుగుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న అనిశ్చితులు, ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణం నేపథ్యంలో మదుపరులు సురక్షిత పెట్టుబడి సాధనాలైన బంగారం, వెండి వైపు మొగ్గు చూపుతున్నారు. బంగారం ధరలు భారీగా పెరగడంతో చాలా మంది చిన్న ఇన్వెస్టర్లు, ప్రజలు వెండిని కొనుగోలు చేస్తున్నారు. బుధవారం వెండి ధర ఏకంగా కిలోకు రూ.11 వేలు పెరిగింది. దీంతో కిలో వెండి ప్రస్తుతం రూ.2,22,000కు చేరుకుంది. రానున్న రోజుల్లో వెండి ధరలు మరింత పెరుగుతాయని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

## వారికి రూ.10 వేల పరిహారం..

**అక్షరటుడే, ఢిల్లీ:** ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకు తీవ్రమవుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడున్నారు. కాలుష్యం కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాలుష్యం నియంత్రణకు ఢిల్లీ ప్రభుత్వం నిర్మాణాలపై ఆంక్షలు విధించింది. దీంతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. ఈ క్రమంలో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు రూ.10 వేల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. రాజధాని ప్రాంతం అంతటా తీవ్రమైన కాలుష్య స్థాయిల మధ్య నిర్మాణ కార్యకలాపాలు నిలిచిపోవడంతో దెబ్బ తిన్న కార్మికులకు తక్షణ ఆర్థిక ఉపశమనం కల్పించడం కోసం పరిహారం ఇవ్వనున్నారు.





# ఓటెత్తిన పల్లెలు

**పల్లెలు ఓటెత్తాయి.. పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి.. స్థానిక సంస్థల మూడో విడత ఎన్నికలు బుధవారం చెదురుమదురు ఘటనలు మినహాగా ప్రశాంతంగా ముగిశాయి. చలిని కూడా లెక్క చేయకుండా ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం ఓటింగ్ ముగిసే సమయం వరకూ పోలింగ్ కేంద్రాలు సందడిగా కనిపించాయి. జనం పోటెత్తడంతో భారీగా పోలింగ్ నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 80 శాతానికిపైగా ఓటింగ్ నమోదైందని ఎన్నికల సంఘం ప్రకటించింది. మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

- **తుది విడతలోనూ జోరుగా పోలింగ్**
- **80 శాతానికి పైగా పోలింగ్ నమోదు**
- **మధ్యాహ్నం నుంచి ఓట్ల లెక్కింపు**
- **ముగిసిన పంచాయతీ పోరు**

పల్లె పోరులో భాగంగా మూడో విడత ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 182 మండలాల్లోని 4,159 పంచాయతీలు, 36,452 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించడానికి ఈసీ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే 394 జీపీలు ఏకగ్రీవం కాగా, 11 చోట్ల నామినేషన్లు రాలేదు. మిగిలిన 3,752 పంచాయతీల్లో బుధవారం ఎన్నికలు జరిగాయి. అలాగే 7908 వార్డులు ఏకగ్రీవం కాగా, 116 చోట్ల నామినేషన్లు రాలేదు. మిగిలిన 28,410 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ నిర్వహించగా, ఓటర్లు భారీగా తరలివచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు.

### పలుచోట్ల ఘర్షణలు..

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా అక్కడక్కడ స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం, తోపులాటలు జరిగాయి. వికారాబాద్ జిల్లా పరిగి మండలం మాదారం గ్రామంలో అధికార, ప్రతిపక్ష శ్రేణులు ఘర్షణకు దిగాయి. బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి రాములుపై ప్రత్యర్థులు దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కాంగ్రెస్ నేతపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. పోలింగ్ కేంద్రం సమీపంలో ప్రచారం చేస్తున్నారంటూ కాంగ్రెస్ బీఆర్ఎస్ కార్యకర్తలు ఘర్షణకు దిగారు.

మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ మండలం పొగుల్లపల్లిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ కాంగ్రెస్ వర్గాల మధ్య తోపులాట చోటు చేసుకుంది. కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఈర్యతో పాటు నాలుగురు కార్యకర్తలపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేశారు. ఈ క్రమంలో ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా టేకులపల్లి పరిధిలోని తండాలో అధికార, ప్రతిపక్ష కార్యకర్తలు దాడులకు దిగారు. దొంగ ఓటు వేసేందుకు యత్నిస్తున్నాడని సర్పంచ్ అభ్యర్థి ఓ వ్యక్తిపై చేయి చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. నల్లగొండ జిల్లా డిండి మండలం శాంతిగూడెంలోనూ ఇరువర్గాలు ఘర్షణకు దిగాయి. పోలీసులు వచ్చి వారిని చెదరగొట్టారు.

### ప్రశాంతంగా పంచాయతీ పోరు

రాష్ట్రంలో మూడు విడతల్లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికలు ముగిశాయి. రాష్ట్రంలోని మొత్తం 12 వేల పైచిలుకు పంచాయతీలు, లక్షకు పైగా వార్డు స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. డిసెంబర్ 11న తొలి విడత, 14వ తేదీన రెండో విడత పోలింగ్ నిర్వహించగా, 17న బుధవారం చివరి విడత ఎన్నికలు పూర్తయ్యాయి. ఈసారి పెద్దగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు పూర్తి కావడంతో అటు ప్రభుత్వం, ఇటు అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. తొలి రెండు విడతల్లోనూ కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంది. మూడో విడతలోనూ అదే పరిస్థితి కనిపించింది.

## ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ల కొట్టివేత




**అక్షరటుడే, హైదరాబాద్ :** పార్టీ ఫిరాయింపు పిటిషన్లపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయా పిటిషన్లను ఆయన కొట్టివేశారు. ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హస్తం కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. పది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. పార్టీ మారిన వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ స్పీకర్‌ను కోరింది. దీనిపై ఆయన స్పందించకపోవడంతో సుప్రీంను ఆశ్రయించింది. పిటిషన్లపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని కోర్టు ఆదేశించింది. ఆ గడువు కూడా ముగిసింది. ఈ క్రమంలో తాజాగా స్పీకర్ ఐదుగురు ఎమ్మెల్యేలపై అనర్హతన పిటిషిన్లను కొట్టివేశారు.

### పార్టీ మారలేదని..

సుప్రీంకోర్టు తీర్పు మేరకు స్పీకర్ అనర్హత పిటిషన్లపై విచారణ చేపట్టారు. ఈ విచారణకు ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగతా 8 మంది హాజరయ్యారు. విచారణ సందర్భంగా ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదని చెప్పారు. అభివృద్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిశామని వాదించారు. తమ జీతం నుంచి ప్రతినెలా బీఆర్ఎస్ పార్టీ ఫండ్ కట్ అవుతోందని చెప్పారు. వారి వాదనలతో ఏకీభవించిన స్పీకర్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్, అరికెపూడి గాంధీపై అనర్హత పిటిషన్లను కొట్టివేశారు.

## సంక్రాంతికి 16 ప్రత్యేక రైళ్లు



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో సంబరాలు అద్భుతంగా చేసుకుంటారు. ఈ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్తారు. పండుగ రద్దీని దృష్టిలో పెట్టుకొని రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడపనుంది. 16 అదనపు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. జనవరి 9 నుంచి 19 తేదీల మధ్య రాకపోకలు సాగించనున్నాయి.



## బంగ్లాదేశ్ హైకమిషనర్‌కు భారత్ సమన్లు


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత్-బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాల్లో ఇటీవల ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ఆ దేశ హైకమిషనర్‌కు భారత్ సమన్లు జారీ చేసింది. విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) బుధవారం బంగ్లాదేశ్ హైకమిషనర్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. బంగ్లాదేశ్‌లోని నేషనల్ సిటిజన్ పార్టీ (ఎన్‌సీపీ) నాయకుడు హస్నత్ అబ్దుల్లా చేసిన భారత వ్యతిరేక వ్యాఖ్యలు చేయడంతో పాటు ఢాకాలోని భారత హైకమిషన్‌కు భద్రతా బెదిరింపులు రావడంతో సమన్లు జారీ చేసింది.

## బీజేపీపై జగ్గారెడ్డి ఫైర్



**అక్షరటుడే, హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పేరు మార్చడంపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్ అయ్యారు. ప్రజలకు మేలు చేస్తారని బీజేపీకి ప్రజలు మూడు సార్లు పట్టం కడితే నరేంద్ర మోదీ, అమిత్ షా మాత్రం.. గాంధీ, నెహ్రూలను టార్గెట్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూ మీలా క్రిమినల్స్ కాదని ఘాటుగా వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. 1930లోనే గాంధీ 'రఘుపతి రాఘవ రాజారామ్ పతిత పావన సీతారామ్' అంటూ సత్యాగ్రహం మొదలు పెట్టారన్నారు. ఆయన రాముడి గురించి చెప్పిన రోజు మోడీ, అమిత్ షాలు పుట్టలేదని అసలు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు ఎక్కడ ఉన్నాయని నిలదీశారు. గాంధీ, నెహ్రూల పేర్లు లేకుండా చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు.

## మరో ఏడు దేశాలపై అమెరికా ట్రావెల్ బ్యాన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. మరో ఏడు దేశాలపై ట్రావెల్ బ్యాన్ విధించారు. ఇప్పటికే 12 దేశాలపై పూర్తి నిషేధం అమలులో ఉంది. ప్రస్తుతం ఆ సంఖ్య 19కి చేరింది. ప్రయాణ, వలసల కోసం యూఎస్ ప్రవేశ ప్రమాణాలను కఠినతరం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ ప్రయాణ ఆంక్షలు అమలులోకి వచ్చాయి. ఇటీవల అమెరికా వైట్‌హౌస్ వద్ద అఫ్గానిస్థాన్‌కు చెందిన వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఇద్దరు నేషనల్ గార్డ్ సభ్యులు చనిపోయారు. ఈ ఘటన అనంతరం ట్రంప్ మూడో ప్రపంచ దేశాల నుంచి అమెరికాకు వలసలు తగ్గిస్తామని, ఆయా దేశాల నుంచి వచ్చిన వారి శాశ్వత నివాస స్థితిని సమీక్షిస్తామన్నారు. ఈ క్రమంలో తాజాగా ట్రావెల్ బ్యాన్ విధించారు. సిరియా, బుర్కినా ఫాసో, మాలి, నైజర్, దక్షిణ సూడాన్, లావోస్, సియెర్రా లియోన్, మయన్మార్, చాడ్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వటోరియల్ గినియా, హైతీ, ఎరిట్రియా, ఇరాన్, లిబియా, సోమాలియా, సూడాన్, యెమెన్, అఫ్ఘనిస్తాన్ దేశాలపై ప్రస్తుతం ఎదుర్కొంటున్నాయి.

## ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి?



**భారతీయ సినిమా పరిశ్రమలో బయోపిక్‌ల ట్రెండ్ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే కర్ణాటక సంగీతానికి 'రాణి'గా గుర్తింపు పొందిన, భారతరత్న పురస్కారం అందుకున్న తొలి సంగీత కళాకారిణి ఎం.ఎస్. సుబ్బలక్ష్మి జీవిత కథను సినిమాగా తెరకెక్కించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రతిష్టాత్మక బయోపిక్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించనున్నట్లు సమాచారం. అయితే ఈ చిత్రంలో సుబ్బలక్ష్మి పాత్రను ఎవరు పోషిస్తారనే చర్చ సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. సహజమైన నటన, భావోద్వేగాలను హృదయాన్ని తాకేలా వ్యక్తీకరించే నటి సాయి పల్లవి ఈ పాత్రకు ఎంపికైనట్లు తెలుస్తోంది.**

**- అక్షరటుడే, సినిమాడెస్క్**